అప్రమత్తతతోనే ప్రాణరక్షణ

- వానాకాలంలో అన్నదాతలు ఆదమరిస్తే అంతే..
- పాములు, విషపు పురుగులతో ప్రమాదం
- ట్రాక్టర్ల వినియోగం, విద్యుత్ మరమ్మతుల్లో జాగ్రత్త



ట్రాక్టర్‌తో పొలాన్ని దమ్ము చేస్తున్న రైతు

మొగుళ్లపల్లి: వర్షాలు కురుస్తుండడంతో రైతులు పొలం పనులకు శ్రీకారం చుట్టారు. వర్షాకాలంలో పాములు, విషపు పురుగులు సంచారం ఎక్కువగా ఉంటుంది. మరోవైపు విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. వ్యవసాయ పనులకు ఉపయోగించే వాహనాలను నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. ఏమరపాటుతో విద్యుత్, ట్రాక్టర్ ప్రమాదాలు జరగడం, పాముకాటుతో రైతులు, కూలీలు చనిపోతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం సాగు నేపథ్యంలో అధికారులు పలు సూచనలు ఇస్తున్నారు.

పెరిగిన ట్రాక్టర్ల వినియోగం

మండల పరిధిలో వర్షాకాలం పనులు ఊపందుకున్నాయి. రైతులు పొలం పనులు ట్రాక్టర్లతోనే చేయిస్తున్నారు. ఈ క్రమంలో యంత్రాల వినియోగంలో అనుభవరాహిత్యమో.. ఆ జాగ్రత్తతోనో ప్రమాదాల బారిన పడుతున్నారు. రైతులు అనుభవం ఉన్న డ్రైవర్లతోనే కేజీవీల్స్ ట్రాక్టర్లు నడిపించాలి. ట్రాక్టర్ ముందుభాగంలో బంపర్ వద్ద 150 కేజీల బరువు అమర్చడం మంచిది. దీంతో ట్రాక్టర్ గట్టు ఎక్కేటప్పుడు ముందు భాగం పైకి లేచి పల్టీకొటకుండా ఉంటుంది. ట్రాక్టర్ పొలంలో దిగబడితే కట్టెలు పెట్టి ముందుకు నడుపుతుంటారు. దీని ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. కేజీవీల్స్ వెనుకల నాగళ్లు అమర్చుకోవడంతో పల్టీ కొట్టదు.

పాములతో ప్రమాదం

వర్షాకాలంలో ఎక్కువ మంది రైతులు పాముకాటుకు గురవుతుంటారు. మందులు ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది ప్రాణాలు పొగొట్టుకుంటున్నారు. వర్షాకాలంలో రైతులు రాత్రి సమయంలో వ్యవసాయ పనులకు వెళ్లే వారు తమ వెంట టార్చిలైట్ ఉంచుకోవాలి. కాళ్లకు బూట్లు లేదా కాలుపై భాగం వరకు కప్పి ఉంచే చెప్పులు ధరించాలి. చేతిలో కర్ర పట్టుకొని శబ్దం చేసుకుంటూ వెళ్లాలి. పాముకాటు వేస్తే భయపడకుండా ధైర్యంగా ఉండాలి. పాముకాటు వేసిన ప్రాంతం నుంచి పది ఇంచులా దూరంలో గట్టిగా తాడుతో గాని, చేతి రుమాలుతో గానీ గట్టిగా కట్టుకోవాలి. బాధితులను వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లాలి.

విద్యుత్‌పై అప్రమత్తం..

వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలి. ఇళ్ల, పొలాల వద్ద విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి. విద్యుత్ మరమ్మతుల సమయంలో టెస్టర్ వినియోగించాలి. వర్షం పడితే స్టార్టర్లు తడవకుండా, పొడి ప్రదేశంలో మాత్రమే ఉంచాలి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్టార్టర్లు చుట్టూ పిచ్చిమొక్కలు పొదలు ఉంటే తొలగించాలి. స్టార్టర్లు అమర్చుకోవాలి. తడి చేతులతో విద్యుత్ పరికరాలను, స్విచ్‌లను తాకొద్దు. విద్యుత్ సమస్యలు ఉంటే సంబంధిత సిబ్బందికి తెలియజేయాలి.

అవగాహన కల్పించాలి



రైతులకు అధికారులు సరైన అవగాహన కల్పించక పోవడంతోనే ప్రమాదాలకు గురవుతున్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు సలహాలు, సూచనలు ఇస్తుండాలి.

- వీరమల్లు, రైతు

జాగ్రత్తలు తప్పనిసరి



రైతులు వర్షాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి పాటించాలి. పొలాల గెట్ల వెంబడి పాములు ఉండే అవకాశం ఉంటుంది కావున పొలాలకు వెళ్లే సమయంలో రైతులు చేతిలో కర్రతో చప్పుడు పెట్టుకుని శబ్దం చేస్తుండాలి. మైనర్లకు ట్రాక్టర్లు ఇవ్వొద్దు అనుభవం కలిగిన డ్రైవర్లతోనే పొలం పనులు చేయించుకోవాలి.

- సురేందర్‌రెడ్డి, ఏఓ, మొగుళ్లపల్లి

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కాళేశ్వరం: వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు



చిట్యాలలో..



ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కారించాలని ఉపాధ్యాయ సంఘం పోరాట కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు తహసీల్దార్ కార్యాలయాల్లో గురువారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయుల పెన్షనరీ బెనిఫిట్స్‌ను విడుదల చేయాలన్నారు. ఉపాధ్యాయులకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. - సాక్షి నెట్‌వర్క్



టేకుమట్లలో..



రేగొండలో..

'బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుని తీరుతాం'

- బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాము

భూపాలపల్లి అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకొని తీరుతామని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి ముస్కె రాము తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జ్ సెగ్గం దినేష్ ఆధ్వర్యంలో తెలంగాణ నీటి వనరులపై విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం రాము మాట్లాడుతూ.. రాష్ట్ర నీటి వనరుల వాటాలు వాటిపైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనుసరిస్తున్న విధానాలను వివరించారు. బనకచర్ల ప్రాజెక్టు ద్వారా తెలంగాణ అన్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జనకచర్లపై ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడం సిగ్గు చేటుగా ఉందన్నారు. ఏపీ సీఎంకు మద్దతు ప్రకటిస్తున్నట్లుగా కలిపిస్తుందని ఆరోపించారు. నాయకులు కొల్లోజు దిలీప్‌కుమార్, ఆకుదారి మనోహర్, బానోత్ మహేశ్వర్, హరీష్, దిలీప్, పవన్, రాజు పాల్గొన్నారు.

తెగిన రోడ్డు.. నిలిచిన రాకపోకలు



తెగిపోయిన మట్టి రోడ్డు

మల్హర్: కురుస్తున్న వర్షాలతో మండలంలోని కాపురం గుట్ట నుంచి భూపాలపల్లి కొంపల్లి వరకు ఏర్పాటు చేసిన కన్వేయర్ బెల్ట్ మట్టి రోడ్డు కాసీంపల్లి సమీపంలో గురువారం తెగిపోయింది. దీంతో రాకపోకలు నిలిచి పోయాయి. జిల్లా కేంద్రం నుంచి ఈ రోడ్డు మార్గం గుండా నిత్యం తాడిచర్ల ఏఎమ్మార్ కంపెనీకి, భూపాలపల్లి, తాడిచర్ల మీదుగా మంథని వైపునకు వెళ్లడానికి ప్రయాణిస్తుంటారు. తాత్కాలిక రోడ్డు తెగిపోవడంతో భూపాలపల్లి నుంచి వచ్చే వారు పెద్దతూండ్ల కిషన్‌రావుపల్లి అటవీప్రాంతం, భూపాలపల్లి ప్రధాన రహదారి నుంచి రుద్రారం మీదుగా తాడిచర్లకు చేరుకుంటున్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- పార్టీ జిల్లా అధ్యక్షుడు బలరాం



గోవిందరావుపేట: మాట్లాడుతున్న బలరాం

ఏటూరునాగారం/గోవిందరావుపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం పిలుపునిచ్చారు. గురువారం ఏటూరునాగారంలో, పస్రాలో ఏర్పాటు చేసిన సమావేశాలకు హాజరై మాట్లాడారు. ప్రతీ ఒక్క కార్యకర్త ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. అప్పుడు బీఆర్‌ఎస్ ఇప్పుడు కాంగ్రెస్ గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి చేయలేదని అన్నారు. స్మశాన వాటికలు, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, హరిత హారం వీధిలైట్లు, సిమెంట్ రోడ్లు అన్నీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే చేశారని చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం మండల అధ్యక్షుడు చక్రవర్తి, ఇన్‌చార్జ్, గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, జిల్లా ఉపాధ్యక్షులు ఏనుగు రవీందర్ రెడ్డి, జినుకుల కృష్ణాకర్, జిల్లా నాయకుడు సాంబశివరావు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు గండిపెల్లి సత్యం, ఎస్సీ మొర్చా జిల్లా అధ్యక్షుడు వావిలాల జనార్ధన్, పస్రాలో మండల అధ్యక్షుడు మార్క సతీష్, సాంబశివుడు, కృష్ణాకర్, సురేందర్, జ్యోతి, రవీందర్ రెడ్డి, సత్యనారయణ, అశోక్, రాజన్న, మురళి, సోమిరెడ్డి, నాగేశ్వరరావు, మధుసుదన్ రెడ్డి, కిరణ్, శిభూషోరేన్, మల్లారెడ్డి, పాండు, సారయ్య, శ్రీనివాస్, రంగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

ఏటూరునాగారం: మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఏజెన్సీలోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని కొండాయి వద్ద జంపన్నవాగు ఉప్పొంగడంతో రాకపోకలకు ఇబ్బందిలేకుండా రెండు పడవలను అధికారులు ఏర్పాటు చేశారు. అత్యవసరం అయితేగానీ బయటకు రావద్దని, పడవల్లో ప్రయాణం కనీస అవసరాలు, నిత్యావసరాలకు మాత్రమే రావాలని కోరారు.

ముంపు గ్రామాల్లో ఏఎస్పీ పర్యటన

ఏటూరునాగారం: భారీ వర్షాలకు మండలంలోని కొండాయి వద్ద జంపన్నవాగు ఉధృతంగా ప్రవహించడంతో గురువారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ పరిశీలించారు. మల్యాల, కొండాయి, కొత్తూరు, ఐలాపురం గ్రామాల ప్రజల రాకపోకలకోసం ఏర్పాటు చేసిన రబ్బర్ బోట్‌లో ఏఎస్పీ పర్యటించి పరిస్థితిని తెలుసుకున్నారు. నాలుగైదు రోజుల వరకు వర్షం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, వాగులు దాటొద్దని లోతట్టు గ్రామాల ప్రజలకు ఏఎస్పీ వివరించారు.

ప్రవహిస్తున్న బొగ్గుల వాగు

ములుగు రూరల్: వర్షాలకు మండలంలోని సర్వాపూర్-అంకన్నగూడెం గ్రామాల మధ్య గల బొగ్గు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. గురువారం ప్రజా సంఘాల జేఏసీ నాయకుడు ముంజాల భిక్షపతి బొగ్గులవాగును సందర్శించి మాట్లాడుతూ జగ్గన్నగూడెం ప్రజలు జలదిగ్బంధంలో ఉంటున్నారని అన్నారు. బొగ్గువాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని అన్నారు.

దామిని యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్సై సాకపురం దివ్య



అవగాహన కల్పిస్తున్న ఎస్సై దివ్య

రేగొండ (కొత్తపల్లిగోరి): భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు దామిని యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై సాకపురం దివ్య అన్నారు. గురువారం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో దామిని యాప్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు పడుతున్న సమయంలో పిడుగులు పడే అవకాశం ఉండటంతో, పిడుగు వంటి విపత్కర పరిస్థితుల గురించి దామిని యాప్ ద్వారా ముందుగానే సమాచారం తెలుసుకుని ప్రాణాలు కాపాడుకోవచ్చన్నారు. మొబైల్‌లో ఈ యాప్ ఉన్నట్లయితే జీపీఎస్ లోకేషన్ ఆధారంగా అరగంట ముందుగానే 20 నుంచి 40 కిలోమీటర్ల పరిధిలో పిడుగుల గురించి ఈ యాప్ హెచ్చరిస్తుందన్నారు. అలాగే పిడుగులు పడే ప్రాంతంలో ఉన్నప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కూడా తెలియజేస్తుందన్నారు. భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటికి రావొద్దని సూచించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి



కూరగాయలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి

పలిమెల: విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పంకెలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంపీడీఓ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిచెన్, స్టోర్ రూమ్, క్లాస్ రూమ్‌లను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సిబ్బందిని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలి

- ఎంఈఓ లక్ష్మణ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్‌బాబు

మల్హర్: ఉపాధ్యాయులు నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని ఎంఈఓ లక్ష్మణ్‌బాబు అన్నారు. మండలంలోని వల్లెకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం ప్రైమరీ లెవెల్ కాంప్లెక్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో లైబ్రరీ బుక్స్ పీరియడ్స్ నిర్వహించే విధంగా చూడాలన్నారు. విద్యార్థులు లైబ్రరీ బుక్స్ లర్నింగ్ ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకుంటారని ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సుదర్శనం, తిరుపతి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

పారితోషికం చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

టేకుమట్ల: మండలంలో కుల గణన సమగ్ర సర్వే 2024 చేసిన సిబ్బంది పారితోషికం, సీసీఎల్స్ మంజూరు చేయాలని మండలంలోని ఉపాధ్యాయులు మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుల గణన సమగ్ర సర్వే నిర్వహించి ఎనిమిది నెలలు గడుస్తున్న ఇప్పటికీ పారితోషకం ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పారితోషికం విడుదలయ్యేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లకు మరమ్మతు చేయించాలి



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న నాయకులు

గణపురం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఉన్న మరుగుదొడ్లకు మరమ్మతు చేయించాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మోడల్ స్కూల్‌ను నాయకులు సందర్శించి మాట్లాడారు. పాఠశాలలో సుమారు 400 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని పాఠశాలకు వెళ్లాలంటే రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదనపు మరుగుదొడ్లను నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మోతె కర్ణాకర్‌రెడ్డి, నాయకులు పోలసాని లక్ష్మీనరసింహారావు, పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, బైరగాని కుమారస్వామిగౌడ్, పెంచాల రవీందర్, చాడ కిష్టస్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్డుల జారీ నిలుపుదల

భూపాలపల్లి రూరల్: ప్రభుత్వ ఆదేశానుసానం జిల్లాలోని వయోవృద్ధుల కార్డుల జారీ ని 24వ తేదీ నుంచి నిలిపివేసినట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారిణి మల్లీశ్వరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పంపిణీ తేదీని ప్రకటిస్తామన్నారు.

పరామర్శ

మల్హర్: మండలంలోని తాడిచర్లకు చెందిన తాండ్ర జక్కమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి గురువారం పరామర్శించారు. ఆయన మండల మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కోట రవి, అయూబ్‌ఖాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



భూపాలపల్లి: రక్తదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



కాటారం: కేటీఆర్ జన్మదిన వేడుకల్లో పుట్ట మధు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకులు కేటీఆర్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. కేక్ కట్‌చేసి బాణాసంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పట్టణంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి రక్తదానం చేశారు. కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు కాటారానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని గంట జ్యోత్స్నను కలిసి చదువుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.

గోరింటాకు సంబురాలు



గోరింటాకు సంబురాల్లో విద్యార్థినులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని ఊరట్టం గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులు ఆషాఢమాస గోరింటాకు సంబురాలు గురువారం నిర్వహించుకున్నారు. ఉపాధ్యాయులు వెంకటరమణ సరిత, నిర్మలాదేవి, వార్డెన్ రమణ, హనుమయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు



ఎరువుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పులి సంపత్

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని రైతులకు అందుబాటులో ఎరువుల బస్తాలను ఉన్నాయని తాడ్వా యి పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్‌గౌడ్ అన్నారు. గురువారం తాడ్వాయి పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని కాటాపూర్‌లో ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఎరువులను విక్రయించేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఎరువుల కేంద్రాన్ని ప్రారంభించామన్నారు.

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి: ప్రభుత్వ ఆస్పత్రులు, మెడికల్ కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ రాహుల్ శర్మకు గురువారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 10న చిట్యాల సీహెచ్‌సీ, 23న భూపాలపల్లి జిల్లా ఆస్పత్రి, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఆయుష్ ఆస్పత్రిని తాను సందర్శించానని, ఈ సందర్భంగా రోగులు, మెడికల్ కళాశాల విద్యార్థులు అనేక సమస్యలు తన దృష్టికి తీసుకవచ్చారన్నారు. వాటిని త్వరగా పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు కటకం జనార్దన్, గండ్ర హరీశ్‌రెడ్డి ఉన్నారు.

గంజాయితో పట్టుబడిన యువకుల రిమాండ్

కాళేశ్వరం: గంజాయితో పట్టుబడిన ముగ్గురి యువకులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై జి.తమాషారెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం కాళేశ్వరం సమీపంలోని అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, మహారాష్ట్ర నుంచి కాళేశ్వరం మీదుగా భూపాలపల్లికి రెండు బైక్‌లపై ముగ్గురు యువకులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. దీంతో వారిని పట్టుకొని విచారించగా మహదేవపూర్ మండలం మద్దులపల్లికి చెందిన కొరల్ల అంజనీకుమార్, భూపాలపల్లికి చెందిన రొడ్డ జశ్వంత్, మట్ల అఖీల్‌లుగా గుర్తించారు. వారి బైక్ బ్యాగులో 1.314 కిలోల గంజాయి లభ్యం కావడంతో స్వాధీనం చేసుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. గురువారం జిల్లా జడ్జి ఎదుట హాజరుపర్చగా జడ్జి జ్యూడిషియల్ రిమాండ్‌కు విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ ముగ్గురు యువకులు భూపాలపల్లి ఐటీఐ కాలేజీలో చదువుతున్న విద్యార్థులని వెల్లడించారు.

ముంపు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గోవిందరావుపేట: మండలంలోని ముంపు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ చేపల వేటకు వెళ్లొద్దని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. మండలంలోని గుండ్లవాగు ప్రాజెక్టు, లక్నవరం సరస్సులను సిబ్బందితో కలిసి గురువారం ఎస్సై అచ్చ కమలాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు ప్రవహిస్తున్నాయని తెలిపారు. గుండ్లవాగు ప్రాజెక్టు నీటి సామర్థ్యం 25 అడుగులు కాగా 24.5 అడుగులు వచ్చాయని అన్నారు. ప్రాజెక్టు అతి తక్కువ సమయంలో మత్తడి పడే అవకాశం ఉందని అన్నారు. ప్రజలు వర్షం తగ్గే వరకు పశువులని, మేకలని ఇంటి దగ్గరే మేపుకోవాలని అన్నారు. అత్యవసరం అయితే ముంపు ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని తెలిపారు. ప్రమాదం అనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా పస్రా పోలీస్ స్టేషన్ నంబర్లు 87126 70085, 87126 70086 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు.

గర్భిణులను తరలించండి



మాట్లాడుతున్న డాక్టర్ కాంత్రికుమార్

వాజేడు: కాన్పుకు సిద్ధంగా ఉన్న గర్భిణులను ఏటూరునాగారం సివిల్ ఆస్పత్రికి తరలించాలని ఐటీడీఏ డిప్యూటీ డీఎమ్‌హెచ్‌ఓ కోరం క్రాంతికుమార్ అన్నారు. మండల పరిధిలోని కృష్ణాపురంలో పేరూరు వైద్యాధికారి రాహిల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. సుమారుగా 50 మంది రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను ఇచ్చారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్న క్రమంలో వైద్యం పరంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తొదన్నారు. అలాగే వాజేడు వైద్యాధికారి మధుకర్ మొరుమూరు గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. గర్భిణులను పరీక్షించి మందులను అందించడంతో పాటు కాన్పుకు దగ్గరగా ఉన్న వారిని గుర్తించారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల కృష్ణ, కోటిరెడ్డి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటాం..

ఏటూరునాగారం: వరదల ముంపు ప్రాంతాల ప్రజలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. గురువారం మండలంలోని కొండాయి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన రబ్బర్‌బోట్‌లో కొండాయి గ్రామాన్ని సందర్శించి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వరదలు తగ్గేంత వరకు ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తామని, ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముక్కెర లాలయ్య, వావిలాల నర్సింహరావు, వావిలాల చిన్న ఎల్లయ్య, ఉమ్మనేని రమేష్, చేల వినయ్, వంగపండ్ల రవి, కుక్కల రాములు పాల్గొన్నారు.